


సంపుటము ౮ ] రాజమహేంద్రవరము ౧౦ మార్చి ౧౯౩౯ [ ౧౨ వ సంచిక

# నిజాం రాష్ట్రమూ—మన ఆంధ్రులున్నూ

శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రి

౨

మొదటి వ్యాసంలో, హైదరాబాదునగరం తాలూకు జనసంఖ్యలో మతాలకు సంబంధించిన వివరాలు మాత్రమే యిచ్చి వున్నాను.

ఇక్కడ భాషలకు సంబంధించిన వివరాలిస్తున్నాను.

| | |
|---|---|
| హైదరాబాదు మొత్తం జనసంఖ్య | ౪,౬౬,౮౯౪ |
| ఇందులో | |
| ౧ ఆంధ్రం మాట్లాడేవారు | ౧,౭౩,౩౫౭ |
| ౨ మహారాష్ట్రం | ౧౬,౩౪౪ |
| ౩ కన్నడం | ౩,౫౩౧ |
| ౪ ఉర్దూ (హిందువులూ ముస్లిములూ కలిసి) | ౨,౧౮,౨౦౬ |
| ౫ బంజారీ (లంబాడీ) | ౩౮౭ |
| ౬ ఎరుకల | ౨౮౯ |
| ౭ గుజరాతీ | ౫,౬౨౬ |
| ౮ రాజస్థానీ | ౮,౪౩౯ |
| ౯ అరవం | ౧౮,౦౬౩ |
| ౧౦ అరబ్బీ | ౧,౮౫౫ |
| ౧౧ ఇంగ్లీషు | ౯,౫౧౭ |

ఇక్కడ మనం గమనించవలసిన సంగతి యేమిటంటే?

హైదరాబాదులో మన ఆంధ్రులు ౬౦ వేలు తక్కువగా సగం వున్నారు. ౨౦ వేలు ఎక్కువగా మూడోవంతు వున్నారు.

పైగా ఆనగరం తెనుగుదేశఖండంలో నడిబొడ్డున వున్నది.

తక్కిన భాషలవారందరూ వర్తకం కోసమూ, వుద్యోగాల కోసమూ, రాజాశ్రయం కోసమూ వచ్చినవారే కాని స్థానికులు కారు; కాని అది తెనుగునగరం అన్నట్టుండదు. అక్కడ, ఆంధ్రులు, కలకత్తా బొంబాయివంటి దూరస్థపరభాషానగరాల్లో లాగ చెదిరి చెదిరి బెదుగుతూ బెదుగుతూ వున్నట్టు కనపడతారు.

కారణం?

మనలో వున్న స్వస్థానవేషభాషాద్వైషమ్యమే.

పైవాళ్లని చూసిన్నీ నేర్చుకోలేని అవివేకమే.

మనది చరిత్రప్రసిద్ధమైన ప్రత్యేకజాతి అనే జ్ఞానం సుతరామూ లేకపోవడమే.

హైదరాబాదు వీధుల్లో ముస్లిము లెందరో కనపడతారు; కాని చిత్రం యేమిటంటే! వారందరూ ముస్లిములు కారు. వారిలో మూడోవంతయినా బ్రాహ్మలు—వైశ్యులు—రడ్లు—ఇలాంటి శుద్ధాంధ్రు లుంటారు. మాటను పట్టికూడా వారాంధ్రు లని మనం గ్రహించలేము. వారు వురుదూలోనే మాట్లాడుకుంటారు. అవురుదూ అచ్చంగా ముస్లిములు మాట్లాడుతున్నట్టే వుంటుంది.

దీనికి సాయం హైదరాబాదులో వున్న పెద్దపెద్ద షాపుల్లో వొకటీ ఆంధ్రులది కాదు.

ఇంకొక సంగతి కూడా మనం గమనించతగ్గది వున్నది. అది మన అరవసోదరుల విషయం.

నిజాము రాష్ట్రం అంతటా వున్న అరవల మొత్తం సంఖ్య ౨౯,౦౫౦. కాని వారిలో ౧౮,౦౬౩ గురు ఒక్క హైదరాబాదులోనే వున్నారు.

ఎంచేతా?

హైదరాబాదు, నిజాము రాష్ట్రానికి రాజధాని.

రాష్ట్రం యెంత పెద్ద దయినా దాని అయువుపట్టు రాజధానిలో వుంటుంది. జిల్లాలలో యెంతెంత పెద్దపెద్ద ఆఫీసు లుండినా—యెంతెంత లేని మహామహాసంస్థ లుండినా వాటి ముసదాల్లన్నీ రాజధానిలో వుంటాయి.

రాజధానిలో వొక్కొక్క మంచి పదవి ఆక్రమించుకోగలిగితే అథవా పదస్థు లయినవారిలో వొక్కరి దయినా అనుగ్రహం సంపాదించుకోగలిగితే రాష్ట్రం అంతటా కొసుబంగారం కంటే యెక్కువగా చెలామణీ కావచ్చు.

అరవల కిది బాగా తెలుసు.

కనకనే వారు, మూడువంతుల్లో రెండువంతులు హైదరాబాదులోనే కణాయించారు.

తక్కిన ౧౧ వేల అరవలూ రాష్ట్రం అంతటా వ్యాపించగలిగా రంటే—సర్కారు వుద్యోగాలలో స్థిరపడి వున్నా రంటే దానికి కారణం హైదరాబాదులో వున్న అరవల ప్రాబల్యమే.

ఈవొక్క సంగతీ చూస్తే మన అభాగ్యదశ పూర్తిగా బోధపడుతుంది.

మన ఆంధ్రదేశంలో మద్రాసూ, హైదరాబాదూ—రెండు రాజధాను లున్నవి.

బ్రిటిషిండియా రాష్ట్రాలలో మద్రాసురాష్ట్రం చాలా పెద్దది. అలాగే స్వదేశసంస్థానరాష్ట్రాలలో నిజామురాష్ట్రమున్నూ చాలా పెద్దది.

అయితే :

ఈరెండు పెద్దరాష్ట్రాల రాజధానులలోనూ మన ఆంధ్రులు తక్కువగానే కాకుండా అధమస్థితిలో వున్నారు.

ఈరెండు రాష్ట్రాల రాజధానులలోనూ అరవలే ప్రముఖు లయిన్నీ వున్నారు.

ఏం?

ఈదశావిపర్యయానికి మనవారిలో లేశమయినా విచారం కనపడదేం!

ఇది యిలా వున్న దనే పరిజ్ఞాన మయినా వున్నట్టు కనపడదేం?

ఈదౌర్భాగ్యదశ మనలో కంటే తక్కువే అయినా రాష్ట్రీయులే అయిన మహారాష్ట్రులలోనూ కన్నడులలోనూ కూడా లేకపోలేదు. ఈక్రింది అంకెలు చూస్తే యిది చాలా చక్కగా బోధపడుతుంది.

| | నిజామురాష్ట్రంలో (వేలు) | రాజధానిలో (వేలు) |
|---|---|---|
| ఆంధ్రులు | ౬౯౭౩ | ౧౭౩ |
| మహారాష్ట్రులు | ౩౭౮౭ | ౧౬ |
| కన్నడులు | ౧౬౨౦ | ౪ |
| అరవలు | .౨౯ | ౧౮ |

అంటే హైదరాబాదులో వేయింటికి

| | |
|---|---|
| ఆంధ్రులు | ౩౮౦ |
| మహారాష్ట్రులు | ౩౫ |
| కన్నడులు | ౭ |
| అరవలు | ౩౯ |

అరవల ముఖ్యవృత్తులు (అరవదేశంలో కూడా) రెండు. వాటిలో వొకటి ఉద్యోగం. రెండోది కాఫీహోటలు.

హైదరాబాదులో అరవకాఫీహోటల్లు ప్రతివీధినీ వున్నాయి. అయినా వుద్యోగాలలోనే వారి సంఖ్య యెక్కువ.

దానికి కారణం బ్రిటిషురాష్ట్రాలలో లాగే నిజాము రాష్ట్రంలో కూడా వుద్యోగస్థుల జీతాలు చాలా యెక్కువ కావడం.

కాస్త మంచి వుద్యోగం సంపాదించుకోగలిగితే, పాదుపైన మనిషి, అక్కడ కూడా వుద్యోగం మానుకునేటప్పటికి లక్షాధికారి కావచ్చు.

## అధికారుల జీతాలు

నిజామురాష్ట్రంలో రాజ్యాంగయంత్రం నడిపే అధికారుల జీతాలూ అలవెన్సులూ యిలా వున్నవి.

| ఉద్యోగి | నెలజీతం (రూపాయిలు) | అలవెన్సు (రూపాయలు) |
|---|---|---|
| ౧ పేష్కారు | ౬౦౦౦ | |
| ౨ ప్రధానమంత్రి | ౭౦౦౦ | ౧౦౦౦ |
| ౩ సైన్యశాఖామంత్రి | ౩౫౦౦ | |
| ౪ ఫైనాన్సుమంత్రి | ౪౨౫౦ | ౧౦౦ B. G. |
| ౫ రెవెన్యూమంత్రి | ౪౦౦౦ | ౧౦౦ మోటారు |
| ౬ P. W. D. శాఖమంత్రి | ౩౫౦౦ | |
| ౭ న్యాయశాఖమంత్రి | ౩౫౦౦ | |
| ౮ పొలిటికల్ డిపార్టుమెంటుమంత్రి | ౩౫౦౦ | ౫౦౦ |
| ౯ ప్రభువు సమక్షంలోవుండేమంత్రి | ౪౦౦౦ | |
| ౧౦ ఎక్జిక్యూటివు కౌన్సిల్ సెక్రటరీ | ౧౨౦౦ | ౩౦౦ |
| ౧౧ పొలిటికల్ డిపార్టుమెంటు సెక్రటరీ | ౧౫౦౦ | |
| ౧౨ పొ. డి. అసిస్టెంటుసెక్రటరీ | ౧౨౦౦ | |
| ౧౩ ఫైనాన్సు సెక్రటరీ | ౧౫౦౦ | ౫౦౦ |
| ౧౪ రెవెన్యూసెక్రటరీ | ౩౨౫౦ | ౨౫౦ B. G. |
| ౧౫ ఇనాములశాఖాధికారి | ౧౨౫౦ | |
| ౧౬ రెవెన్యూసంయుక్తకార్యదర్శి | ౧౨౦౦ | ౩౦౦ |
| ౧౭ రెవెన్యూఅసిస్టెంటుసెక్రటరీ | ౧౦౦౦ | ౧౦౦ |
| ౧౮ ఫైనాన్సుఅసిస్టెంటుసెక్రటరీ | ౧౨౦౦ | ౧౦౦ |
| ౧౯ న్యాయశాఖసెక్రటరీ | ౨౦౦౦ | ౩౦౦ |
| ౨౦ న్యాయశాఖఅసిస్టెంటుసెక్రటరీ | ౧౨౦౦ | |
| ౨౧ P. W. D. శాఖసెక్రటరీ | ౨౫౦౦ | ౮౫౦ |
| ౨౨ అసిస్టెంటుఛీఫ్ఇంజనీర్ | ౧౫౦౦ | ౩౦౦ |

| | | |
|---|---|---|
| ౨౩ అసిస్టెంటుసెక్రటరీ | ౧౨౦౦ | |
| ౨౪ ప్రైయివేటుసెక్రటరీ | ౧౮౦౦ | ౩౫౦ |
| ౨౫ వ్యాపారశాఖసెక్రటరీ | ౧౨౦౦ | ౬౦౦ |
| ౨౬ లీగల్ అడ్వైజరు | ౨౦౦౦ | ౩౦౦ |
| ౨౭ మతశాఖసెక్రటరీ | ౧౫౦౦ | |
| ౨౮ అక్కౌంటెంటుజనరల్ | ౧౫౦౦ | ౩౦౦ |
| ౨౯ టంకసాలఅధికారి | ౨౦౦౦ | ౬౦౦ |
| ౩౦ సుబేదారు | ౧౫౦౦ | ౧౦౦ |
| ౩౧ ఫస్టుగ్రేడుజిల్లాకలెక్టరు | ౧౨౦౦ | |
| ౩౨ సెకండుగ్రేడుజిల్లాకలెక్టరు | ౬౦౦ | |
| ౩౩ తహసీల్దారు | ౩౦౦-౩౫౦ వరకు | |

## రాష్ట్రాదాయం

### ౧౩౪౨ ఫసలీలో రాష్ట్రాదాయం పద్దులు

| | |
|---|---|
| ౧ భూమిపన్ను | ౩,౦౫,౪౩,౦౦౦ |
| ౨ అడవులు | ౧౩,౬౬,౦౦౦ |
| ౩ కష్టమ్సు (కరోడగిరీ) | ౧,౦౨,౫౪,౦౦౦ |
| ౪ ఆబ్కారీ | ౧,౫౮,౪౪,౦౦౦ |
| ౫ నల్లమందు—గంజాయి | ౧౪,౨౬,౦౦౦ |
| ౬ స్టాంపులు | ౧౯,౯౧,౦౦౦ |
| ౭ రిజిస్ట్రేషను | ౨,౯౫,౦౦౦ |
| ౮ గనులు | ౨,౮౨,౦౦౦ |
| ౯ బీరారుప్రతిఫలం | ౨౯,౧౭,౦౦౦ |
| ౧౦ వడ్డీ | ౭౩,౫౮,౦౦౦ |
| ౧౧ టంకసాల | ౫౪,౦౦౦ |
| ౧౨ నోట్లు (కాకితాలు) | ౨౦,౯౬,౦౦౦ |
| ౧౩ నాణెములమారకం | ౧౨,౦౦౦ |
| ౧౪ పోస్టు | ౧౧,౨౭,౦౦౦ |
| ౧౫ ఇరిగేషన్ | ౪౧,౦౦౦ |
| ౧౬ రైల్వేలు | ౩౮,౧౮,౦౦౦ |
| ౧౭ ఎలెక్ట్రిసిటీ | ౧,౩౮,౦౦౦ |
| ౧౮ ఇతరాలు | ౫,౫౧,౦౦౦ |

మొత్తం ఆదాయం ౮,౦౬,౧౮,౦౦౦

## ఖర్చులు

### ౧౩౪౨ ఫసలీలో రాష్ట్రం ముఖ్యఖర్చులు

| | |
|---|---|
| ౧ రెవెన్యూ | ౬౮,౭౦,౦౦౦ |
| ౨ ఇరిగేషను | ౭,౦౮,౦౦౦ |
| ౩ అడవులు | ౯,౪౬,౦౦౦ |
| ౪ కష్టమ్సు (కరోడగిరీ) | ౨౨,౨౮,౦౦౦ |
| ౫ ఆబ్కారీ | ౩౨,౧౮,౦౦౦ |
| ౬ నల్లమందు—గంజాయి | ౧,౧౪,౦౦౦ |
| ౭ స్టాంపులు | ౧,౧౧,౦౦౦ |
| ౮ రిజిస్ట్రేషను | ౧,౬౩,౦౦౦ |
| ౯ గనులు | ౮౮,౦౦౦ |
| ౧౦ వడ్డీ | ౩౪,౬౮,౦౦౦ |
| ౧౧ అప్పులు | ౬,౦౦,౦౦౦ |
| ౧౨ టంకసాల | ౧,౬౩,౦౦౦ |
| ౧౩ ప్రభువు గారికి చెల్లింపులు | ౫౪,౧౩,౦౦౦ |
| ౧౪ యువరాజుల ఖర్చులు | ౭,౮౪,౦౦౦ |
| ౧౫ జనరల్ పరిపాలన | ౪౧,౧౪,౦౦౦ |
| ౧౬ మన్సబులు | ౧౫,౪౬.౦౦౦ |
| ౧౭ మిలిటరీ | ౮౮,౫౮,౦౦౦ |
| ౧౮ న్యాయస్థానాలు | ౨౨,౫౭,౦౦౦ |
| ౧౯ జెయిళ్లు | ౪,౯౫,౦౦౦ |
| ౨౦ పోలీసు | ౬౭,౪౪,౦౦౦ |
| ౨౧ విద్య | ౯౮,౨౦,౦౦౦ |
| ౨౨ వైద్యం | ౨౯,౩౬,౦౦౦ |
| ౨౩ మతశాఖ | ౧౨,౧౯,౦౦౦ |
| ౨౪ వ్యవసాయశాఖ | ౮,౫౫,౦౦౦ |
| ౨౫ పశువైద్యం | ౪,౭౨,౦౦౦ |
| ౨౬ సహకారశాఖ | ౩,౮౯,౦౦౦ |
| ౨౭ మునిసిపాలిటీలు | ౫౧,౮౨,౦౦౦ |
| ౨౮ రోడ్లు—బంగాళాలు | ౬౯,౪౨,౦౦౦ |
| ౨౯ రైల్వేలు | ౧,౫౫,౦౦౦ |
| ౩౦ పరిశ్రమలు | ౩,౧౧,౦౦౦ |

## పరిపాలనం

ఇవాళ, ప్రజలకు, సర్వస్వాతంత్ర్యాలూ దఖలుపడా లని తీవ్రత రాందోళనం జరుగుతున్న యీనిజాము రాష్ట్రంలో ౮౧ సంవత్స రాల కిందట ప్రభువూ పన్నులవసూళ్లూ తప్ప మరేమీ లేవు.

రెవెన్యూ కచేరీ లేదు. స్టాంపులు లేవు. న్యాయస్థానాలు లేవు. చివరికి పోలీసులు కూడా లేరు.

గ్రామాలలో పొలిమేరల యేర్పాట్లు లేవు. భూములకు కొలతలూ, పట్టాలూ, పన్నుల నిర్ణయమూ లేవు.

కలెక్టర్లు లేరు. తహసీలుదార్లు లేరు.

సర్కారు ఖజానా కూడా లేదు.

అప్పుడు సుబాలకు మారుగా సర్కారు లుండేవి. జిల్లాలకు బదులు మహాలులూ, తాలూకాలకు మారుగా పరగణాలూ వుండేవి.

రాజధానిలో అప్పుడు "దఫ్తరే మాల్" అనీ "దఫ్తరే దీవానీ" అనీ రెండు కచేరీలే వుండేవి. "దారుల్ ఇన్షా" అని, మంత్రికి, మరివొక కచేరీ వుండేది.

దేశముఖులూ, దేశపాండ్యాలూ, తాలూక్దార్లనే పేరితో గుత్తదార్లూ పన్నులు వసూలు చేసేవారు.

*ఫలానా పరగణాకు మొత్తం యింత పన్ను అని గుత్తకు పుచ్చుకుని,* వారు ప్రజలను పీడించి తమ యిష్టం వచ్చినంత పుచ్చుకుని, గుత్తమొత్తం సర్కారుకి చెల్లించి మిగతా యావత్తూ తమ సొంతానికి వాడుకుంటూ వుండేవారు.

ఏపేరు పెట్టి యెంత వసూలు చేసినా, ఏయే వృత్తులకు పన్ను కట్టినా వారిని అడిగేవారు లేకపోయేవారు. వెట్టిచాకిరీలు చేయించుకున్నా వారికి అడ్డు లేకపోయేది.

ఈపన్నుల వసూళ్లసందర్భంలో వొకచారిత్రికాంశంచెబుతాను.

వరంగిల్లు ప్రాంతంలో వొక చిన్న గుత్తేదారుండేవాడు.

దేనికి పన్ను విధించాలో, ఎంత విధించాలో—యీనిర్ణయం గుత్తేదారుదే. అపరగణాకు ఇంత మొత్తం అనే తప్ప నవాబు యీ వివరాలకు వెళ్లేవాడు కాడు.

అంచేత గుత్తేదారు కల్పనాచాతుర్యాన్ని బట్టీ, రాక్షసత్వాన్ని పట్టీ పన్నులు ఎక్కడికక్కడే ఒక్కొక్క రకంగా వుండేవి.

అగుత్తేదారు స్త్రీలకు కూడా పన్ను వేశాడు.

ఇంతే కాదు. అపన్ను ఇంత అని నిర్ణయించడానికి అద్భుతమూ, అమోఘమూ అయిన వొక విధానం కూడా కనిపెట్టాడు.

అదేమిటంటే? అతని పరగణాలో వున్న ప్రతీ ఆడదీ, ఏటా, తన స్తనాలలో వొకటి ఎంత వున్నదో అంత రూపాయలపోగు చెల్లించాలి. ఆమె స్తనాలలో పెద్దచిన్న తారతమ్యం వుంటే గుత్తేదారు ఆపెద్దస్తనాన్ని బట్టి పన్ను చెల్లించాలనేవాడు.

ఇంకోటి కూడా కనిపెట్టాడతను.

ఉజ్జాయింపుగా రూపాయలు పోగువేస్తే రూపాయలు ఎక్కువయినా యని ఆస్త్రీ, తక్కువయినా యని అగుత్తేదారూ పేచీలు పడవచ్చు. అలా ఘర్షణ పెరగడం యెల్లప్పుడూ మంచిది కాదనీ, ఏస్త్రీకయినా దానివల్ల అక్రమం జరగవచ్చుననీ, అలా జరగడం శ్రేయస్కరం కాదనీ అధర్మాత్ముడు నిశ్చయించుకున్నాడు. అందుకోసం అతను రకరకాల గిన్నెలు చేయించాడు.

ఇది కల్పన కాదు. అక్షరాలా జరిగింది. వరంగల్లు, ప్రాంతంలో చంద్రగిరిగుట్ట లని వొక కొండ. అకొండమీద వొక దుర్గం. అదుర్గాధిపతి చేసిం దిది.

ఇలాగ పన్నుల నిర్ణయమూ, దానివసూళ్లూ అనేకవిధాలుగానూ, చాలా ఘోరంగానూ వుండేవి.

ఇలాంటి స్థితిలో, ౧౮౫౩ సంవత్సరంలో సర్. సాలార్‌జంగు బహద్దరుగారు నైజాము ప్రధానమంత్రి అయినారు.

దీంతో నైజామురాజ్యంలో అరుణోదయం అయి అంధకారం దిగటితలోకి వచ్చింది.

ఆయన, మొదట, రాష్ట్రం అంతనూ సుబాలుగానూ, జిల్లాలుగానూ, తాలూకాలుగానూ విభజించారు. గుత్తేదారులను తీసివేసి సుబేదారులనూ, కలెక్టర్లనూ, తహశ్శీలుదార్లనూ జీతాలమీద ఏర్పరిచారు. కోర్టులనూ, మున్సిఫ్‌లనూ, జిల్లాజడ్జీలనూ (మీర్ అదిల్) ఏర్పాటు చేశారు. జిల్లాపోలీసును ఏర్పాటుచేశారు. ప్రతీతహశ్శీలుదారుదగ్గిరా రెండేసివందల పోలీసు బలగం చొప్పున వుంచారు.

క్రమంగా, ౧౨౭౦ ఫసలీలో కస్టమ్సు శాఖనూ, ౧౨౭౧ లో స్టాంపుకచ్చేరీని, ౧౨౭౨ ఫసలీలో డిక్రీల తామీలుకచ్చేరీ, న్యాయవిచారణ మీద తనిఖీ చెయ్యడానికి శక్రటరీ శాఖనూ, ౧౨౭౪ ఫసలీలో రెవెన్యూడిపార్టుమెంటునూ, ౧౨౭౪-౧౨౯౦ ఫసలీల మధ్యకాలంలో వైద్యశాఖా, విద్యాశాఖా, అడవుల శాఖా, టపాశాఖా—ఇంకా మరికొన్ని శాఖలనూ ఏర్పరిచారు.

౧౮౯౩ సంవత్సరంలో ఇప్పటినవాబుగారి తండ్రి మీర్ మహబూబలీఖాన్ బహద్దరువారు శాసనసభను నిర్మించారు.

శాసనసభ అంటే ౧ ప్రధానన్యాయమూర్తి. ౨ హైకోర్టు న్యాయమూర్తి, ౩ రెవెన్యూశాఖాధికారి, ౪ విద్యాశాఖాధికారి, ౫ జిల్లాపోలీసుశాఖాధికారి, ౬ ఆర్థికశాఖ శక్రటరీ ఈ ఆరుగురే అందులో సభ్యులు. వీరిమీద ప్రభువు సర్వాధికారి.

వీరికాలంలోనే—అనగా ౧౯౦౨ లో నవాబుగారు బేరారును శాశ్వతంగా బ్రిటిషువారికి కౌలు కిచ్చేటట్టూ, అందుకు ప్రతిఫలంగా బ్రిటిషువారు నిజాముగారికి ఏటా ౨౫ లక్షల రూపాయలు ఇచ్చేటట్టూ కౌలు అంటే వడంబడిక జరిగింది. ౧౯౧౧ అగస్టు ౨౯ తేదీని అనవాబుగారు చనిపోయారు.

తరవాత ఇప్పటి నవాబు సర్. ఉస్మానలీఖాన్ బహద్దరువారు అధికారం వహించారు.

ఇవాళ చూస్తే—సభ్యత గల ప్రభుత్వాల పరిపాలనా విధానాన్ని పట్టిచూస్తే నైజాం ప్రభుత్వము లక్షయుగాల వెనక నేవుంది; కాని యిప్పటినవాబుగారు ఎన్నో మార్పులు చెయ్యగా ఏర్పడిన విధానం యిది.

వీరు చేసినవాటిలో ముఖ్యమైనవి.

౧ హైదరాబాదులో హైకోర్టు, ఉస్మానియాహాస్పిటల్, ఉస్మానియాయూనివర్సిటీ మొదలైనవీ, రాజవీధులూ ఏర్పరచడం.

౨. అనేకతటాకాలు — ఉస్మాన్‌సాగరం, నిజాంసాగరం, హిమాయత్‌సాగరం మొదలైనవి నిర్మించడం.

౩. బాబె హుకూమత్—అంటే ఎక్జిక్యూటివుకౌన్సిల్ (కార్యనిర్వాహకసభ) ఏర్పరచడం.

౪. న్యాయశాఖను కార్యనిర్వాహకశాఖను విడదియ్యడం. (యీ కోర్కెల్లి కాంగ్రెస్సుకోరికను పద్ధెనిమిదేళ్లకిందట నిజాముప్రభువు నెరవేర్చారు. కాని కాంగ్రెస్సుమంత్రులు మాత్రం అపని యిప్పటికీ చెయ్యలేదు)

౫. రెయిల్వేలూ, రోడ్డులూ హెచ్చుచెయ్యడం.

౬. ఉర్దూభాషను ప్రధానం చేసి అది నిమిషాలమీద అభివృద్ధి అయిపోడానికి తగిన తీవ్రమైన కార్యక్రమం ప్రారంభించడం.

# శాసనసభ

నైజాముగారికి శాసనసభ యెందుకూ అని అడిగితే "నూటనల భైనాలుగులక్షల జనులను, తాము నిరంకుశంగా పరిపాలించడం లేదు" అని చెప్పుకోడానికి మాత్రమే.

నిజంగా ౧౯౩౫ సంవత్సరం ఇండియాశాసనమే నిరంకుశంగా వుందని అసంతృప్తి పొందుతున్న మనం నైజాముగారి శాసనసభను "శాసనసభే" అని అంగీకరించము. అంగీకరించలేము.

దానిలో ప్రజాస్వామికత్వానికి సంబంధించిన ప్రాతిపదికలు కూడా లేవు.

దాంతో పోల్చతగ్గది గాంధిగారి కాంగ్రెస్సు వొకటే.

ఏమంటే? నైజాముగారి సొంత అభిప్రాయాల ననుసరించి యెలాంటి శాసనాలైనా యేర్పడడానికందులో అవకాశాలున్నవి. వారికి అంగీకారం కాని శాసనాలను తొలగించడానికి— రద్దుచెయ్యడానికి కూడా వారికందులో అవకాశాలున్నవి.

కొత్త శాసనాలు చెయ్యడానికీ, వున్నవాటిలో మార్పులు చెయ్యడానికీ, ఫర్మానాలు జారీచెయ్యడానికీ, ఇతరవిధాలకూడా తమ యిష్టానుసారం ఆజ్ఞలు చెయ్యడానికీ నైజాముగారు సరస్వతంత్రులు. వారి యీ అధికారాలను శిరసావహించే పద్ధతిలోనే వారి శాసనసభకు సజీవత్వం.

వారి ప్రభుత్వంలో అలాంటిదే కార్యనిర్వాహకసభ (ఎక్జిక్యూటివుకౌన్సిల్) కూడా వున్నది.

ఈశాసనసభను వెనకటి నవాబు మహబూబలీఖాన్ బహద్దరుగారు ౧౮౯౩ లో నిర్మించారని పైని తెలిపి వున్నాను. అంటే ౧౩౦౪ ఫసలీ తాలూకు ౧ వ ఖానూన్ అనుసరించి నిర్మించబడ్డది. దీని నియమాలలో కొన్ని ౧౩౦౯ ఫసలీ తాలూకు ౩ వ ఖానూన్ అనుసరించిన్నీ, కొన్ని ౧౩౧౫ ఫసలీ తాలూకు ౧ వ ఖానూన్ అనుసరించిన్నీ మార్చబడ్డవి.

మార్చబడ్డవి. నిజమే.

కాని ఈ ౪౦ సంవత్సరాలలోనూ జరిగిన మార్పులలో స్ఫుటంగా కనబడేది వొకటీ లేదు. ప్రజలకు చెప్పుకో తగ్గ అధికారాలిచ్చేది అసలే లేదు.

ఇక వివరాలిస్తాను.

దీని సభ్యుల సంఖ్య ౨౨.

ఇందులో అధికారి సభ్యులూ, అధ్యక్షోపాధ్యక్షులూ కలిసి ౧౪ గురు, అనధికారిసభ్యులు ౮ గురు.

ఇంకా విస్తరించాలంటే.

అధికారిసభ్యులలో ౧. ప్రధానన్యాయమూర్తి (మీర్ మజ్లిస్) ౨. న్యాయశాఖ కార్యదర్శి (మొతేమత్ అదాలత్) ౩. లీగల్ అడ్వైజరూ (ముషీరెఖానూన్) వుండితీరాలి.

అనధికారిసభ్యులలో జాగీర్దారుల పక్షంగా ఇద్దరూ, వకీళ్ల పక్షంగా ఇద్దరూ, పాయగా సంస్థానాల పక్షంగా ఎంపబడే సభ్యుడొకడూ, మంత్రి నియమించిన సభ్యుడొకడూ, అనధికారి సభ్యులలో తమ హయాము పూర్తి కాగా విరమించేటప్పుడు వారిలోనుంచి మంత్రి నియమించే సభ్యులిద్దరూ వుంటారు.

సంవత్సరానికి ౬ వేలుగాని, అంతకంటే యెక్కువగా కాని ఆదాయం వచ్చే జాగీర్దార్లే తమలో యిద్దర్ని ఎన్నుకోవాలి. వారే జాగీర్దార్లపక్షం సభ్యులు.

వకీళ్లలో హైకోర్టు వకీళ్లే తమలో యిద్దర్ని ఎన్నుకోవాలి. వారే వకీళ్ల పక్షం సభ్యులు.

అంతకు తక్కువ ఆదాయం గల జాగీర్దార్లకూ, హైకోరు వకీళ్లు కాని వకీళ్లకూ నియోజకత్వం లేదు.

నిజానికి అనధికారి సభ్యులు ౮ గురే; కాని వారిలో, ఉద్దేశం వుంటే—ధైర్యం వుంటే—సాహసం కూడా వుంటే సొంత అభిప్రాయాలు వెల్లడించడానికి వీలున్నవారు వకీలు సభ్యులిద్దరే.

ఎన్నికలు రెండేళ్లకొకమాటు జరుగుతాయి. లీగల్ అడ్వైజరే శాసనసభ కార్యదర్శి. సభ యెప్పుడు కూడేదీ, ఎన్నడు జరిగేదీ, ఎన్నిమాట్లు జరిగేదీ, అంతా మంత్రి యిష్టం. కోరం ౫. కోరం వుండినా అధ్యక్షుడు సభ నిలిపివెయ్యవచ్చు.

## ౧౩౪౪ ఫసలీలో వున్న సభ్యులు

| | | |
|---|---|---|
| ౧ అధ్యక్షుడు. | ౧ | |
| ౨ ఉపాధ్యక్షుడు. | ౧ | |
| ౩ మీర్ మజ్లిస్ | ౧ | వీరు హోదానుసరించి సభ్యులు |
| ౪ హోముసెక్రటరీ | ౧ | |
| ౫ లీగల్ అడ్వైజరు | ౧ | |
| ౬ ఉమూరేమజహబీ (మతశాఖాధికారి, | ౧ | అధికారిసభ్యులు |
| ౭ ఆర్థికశాఖసెక్రటరీ | ౧ | |
| ౮ అతియాత్ సాదిం (ఇనాముల శాఖాధికారి) | ౧ | |
| ౯ రాజకీయశాఖ సెక్రటరీ (మొతేమద్ సియాసియాత్) | ౧ | |
| ౧౦ హైకోర్టున్యాయమూర్తులు | ౨ | |
| ౧౧ కొత్వాలు | ౧ | |
| ౧౨ సర్ఫెఖాస్ స్పెషల్ ఆఫీసరు | ౧ | |
| ౧౩ పారిశ్రామిక కార్యదర్శి | ౧ | |
| ౧౪ మీర్ మజ్లిస్ పాయగా | ౧ | అనధికారిసభ్యులు |
| ౧౫ హైకోర్టువకీళ్లు | ౨ | |
| ౧౬ జాగీర్దార్లు | ౨ | |
| ౧౭ సాహుకారి | ౧ | |
| ౧౮ అసాధారణసభ్యులు | ౨ | |

## నిబంధనలు

సభ్యులు ప్రవేశపెట్టిన బిల్లులు శాసనములుగా నెగ్గగలిగితే అవి ప్రభువు అనుమతికోసం పంపబడతవి. తన వోటుతో కూడా అనుకూల్యమూ ప్రాతికూల్యమూ సమానంగా తేలితే, అధ్యక్షుడు, తన కాస్టింగు వోటుతో దాన్ని నెగ్గించడమో పడగొట్టడమో చెయ్యగలడు. అధ్యక్షుల అనుమతి లేకుండా ౧. సర్కారు ఆదాయమూ, ఖజానా, బాకీలూ—వీటిని గురించీ, ప్రజల మత విశ్వాసాలను గురించీ, సైన్యాన్ని గురించీ, నిజాముప్రభుత్వానికీ బ్రిటిషుప్రభుత్వానికీ గల సంబంధాలను గురించీ, శాసనసభ నియమావళిని గురించీ, ఎవరూ బిల్లులు ప్రవేశపెట్టగూడదు. నైజాముగారి ఫర్మానాలకు విరుద్ధంగా కూడా ఏమీ ప్రవేశపెట్టగూడదు.

అయినా ఇస్లాముమతశాసనాలూ, హిందూధర్మశాస్త్రాలూ, ఆయాసంఘాల ప్రత్యేకశాసనాలూ, ఆచారములూ—వీటికి సంబంధించిన బిల్లులు ప్రవేశపెట్టవచ్చు.

ప్రతీబిల్లూ వారంరోజులకు ముందు ప్రతీసభ్యుడికీ పంపుతారు. మార్పులూ, కూర్పులూ చెయ్యవలసిన అగత్యం కనపడితే వాటిని సెలెక్టుకమిటీలకు పంపుతారు. తరవాత వాటి గతి మెజారిటీని బట్టి వుంటుంది.

మెజారిటీ!

ఎంత శాస్త్రీయమైన మాటా!

అయితే; ప్రజల పక్షంగా చూస్తే మాత్రం యీమెజారిటీ గాలిలోవున్న దీపానికి దేవుడి రక్షణ వంటిదే.

ఇది యింతటితో తీరలేదు.

ఇంతమాత్రపు మెజారిటీకి కూడా నిక్కచ్చి అయిన వడపోత వున్నది.

అదేమిటంటే? నైజాముగారు ఆశాసనం సవరించవచ్చు. మార్చవచ్చు. తిరస్కరించవచ్చు. రద్దుచెయ్యవచ్చు. ఏమయినా చెయ్యవచ్చు.

## దీని నివాసం యెలా వున్నదంటే?

దీనికి సొంత భవనం వున్నది. ౧౩౨౧ ఫసలీలో భవనప్రవేశమహోత్సవం జరిగింది. అప్పుడు, సభవారు, అధికారిసభ్యులూ, అనధికారిసభ్యులూ సమంగా వుండేటట్టు అనుగ్రహించవలసిందని నవాబుగారికి విన్నవించుకున్నారు. దానికి, నవాబుగారు, "ఆరేళ్ల దాకా యిదివరకి వున్న అనధికారిసభ్యులు ఆరుగురికీ సాయం మరో యిద్దుగుర్ని కూడా తీసుకుంటూ వుండవచ్చు" నని హుకుం దయచేశారు; కాని అది యిప్పటికీ అమల్లోకి రాలేదు.

ఇప్పుడు జరుగుతున్నది ౧౩౪౪ వ ఫసలీ.

# కార్యనిర్వాహకసభ

ఇంగ్లీషులో యిది ఎక్జిక్యూటివుకౌన్సిల్. ఉర్దూలో బాబెహుకూమత్.

పూర్వం కౌన్సిల్ఆఫ్‌స్టేటు అనేది వుండేది. తరవాత కాబినెట్టుకౌన్సిలు అనేది కొంతకాలం వుంది. ౧౯౧౯ లో పుట్టిన "ఖానూన్చెముబారక్" అనే శాసనం ప్రకారం యివి నిర్వర్తించబడేవి. ఇప్పటి నవాబుగారు పరిపాలన ప్రారంభించాక కూడా ప్రధానమంత్రి దీనిని కొంతకాలం నడిపించారు. నవాబుగారే అయిదేళ్లు మంత్రిగా కూడా పనిచేశారు. దానివల్ల రాజ్యపాలన యెంత భారమో తెలిసింది. అంచేత, వారు, ౧౩౨౯ వ ఫసలీ దైనెల ౧౬ వ రోజున యీ బాబెహుకూమత్ ఏర్పరిచారు.

దీనికి అధ్యక్షుడు సదరె ఆజం. అంటే ప్రధానమంత్రి. దీనిలో సభ్యులు ఎనమండుగురు. వారిలో ఆరుగురు ఆరు రాజ్యాంగశాఖల పక్షంగా వుంటారు. సదరుల్‌మహాం అని వారి హోదా పేరు.

ఇది వారానికోమాటు కూడుతుంది. ప్రధానమంత్రి లేకపోతే ప్రభువుగా రొకర్ని అధ్యక్షతకు నియోగిస్తారు. అధికసంఖ్యాకుల నిర్ణయం నెగ్గుతుంది.

అది నవాబుగారి అనుమతికి వెడుతుంది. తరవాత వారి చిత్తం.

పెద్దవుద్యోగస్థుల నియామకాలూ, వారి తప్పొప్పుల విచారణా, భూమిశిస్తుల హెచ్చింపు తగ్గింపులూ, అప్పీళ్ళు (మురాఫాలు) వినడమూ, సర్క్యులర్లు (గస్తీలు) జారీచెయ్యడమూ, అదివరకు చేసిన వాటిని రద్దుచెయ్యడం, విద్యావిషయాలూ, ఆరోగ్యనియమాలూ, ఆర్థికనిర్ణయాలూ, వ్యాపారపరిశ్రమల ప్రోత్సాహమూ, రోడ్లూ, రెయిళ్ళూ మొదలైన రాకపోకల సంబంధాలూ సరిగా నడిపించడమూ—మొదలైనవి దీని పనులు.

## సదరుల్‌మహాములు

కార్యనిర్వాహకశాఖలో ఆరుగురు సదరుల్‌మహాములు ఆరు రాజ్యాంగశాఖలు నిర్వహిస్తారని పైని చెప్పి వున్నాను. వారి వివరాలు.

## ౧. సదరుల్‌మహాం మాల్

మాల్గుజారీ అంటే రెవెన్యూ శాఖ. సదరుల్‌మహాంమాల్ అంటే రెవెన్యూమెంబరు. ఈమెంబరు నిర్వహించే డిపార్టుమెంట్లు ఇవి. ౧. రెవెన్యూ ౨. కస్టమ్సు ౩. ఆబ్కారీ ౪. బందోబస్తు (సెటిల్‌మెంటు) ౫. అడవులు (జంగ్లాత్) ౬. స్టాటిస్టిక్సు ౭. అతియాత్ (ఇనాములు) ౮. అభివృద్ధిశాఖ (డెవలప్మెంటు) ౯. కొత్వాలీబల్దా (సిటీపోలీసు) ౧౦. జిల్లాల పోలీసు ౧౧. వ్యవసాయశాఖ ౧౨. పరిశ్రమలు (ఇండస్ట్రీస్.)

### ౨. సదరుల్ మహాం ఫైనాన్సు

అంటే ఫైనాన్సు మెంబరు. ఈ మెంబరు నిర్వహించే డిపార్టుమెంట్లు ౧. సదరుమహాసబీ (అక్కౌంట్సు) ౨. దీవానీ దఫ్తర్ ౩. టంకసాల (ఈ డిపార్టుమెంటులో నాణెములూ, మొరవ్రూ, నోట్లూ, తూకములూ చేరివున్నవి) ౪. రెయిల్వేలు.

### ౩. సదరుల్ మహాం అదాలత్ వ ఉమూరె ఆమ్మా

అంటే హోం సెక్రటేరియట్. ఈ మెంబరు నిర్వహించే డిపార్టుమెంట్లు ౧. పోస్టులు ౨. అదాలతుల్ ఆలియా (హైకోర్టు) ౩. ముద్రాలయము, స్టేషనరీ ౪. ఆసారెకదీమా (పురాతత్వశాఖ) ౫. ఉమూరె మజహాబీ (మతశాఖ.)

### ౪. సదరుల్ మహాం ఫౌజ్ వ తిబాబత్

అంటే సైన్యశాఖా, ఆరోగ్యశాఖాను. ఈ మెంబరు నిర్వహించే డిపార్టుమెంట్లు ౧. సైన్యం (బా ఖాయిదా Regular) బేఖాయిదా (Irregular) ౨. యునానీవైద్యశాఖ ౩. అల్లోపతీ వైద్యశాఖ.

### ౫. సదరుల్ మహాం తామీరాత్

అంటే పబ్లిక్ వర్క్సు మెంబరు. ఈ మెంబరు నిర్వహించే డిపార్టుమెంట్లు. ౧. నీటివసతులు (ఇరిగేషన్) ౨. డ్రెయినేజీ (మురుగు పారుదల) ౩. టెలిఫోను.

### ౬. సదరుల్ మహాం సియాసియాత్

అంటే రాజకీయశాఖ మెంబరు. ఈ మెంబరు నిర్వహించే డిపార్టుమెంట్లు. ౧. రాజకీయశాఖ (పొలిటికల్ డిపార్టుమెంటు) ౨. సఫాయి (మునిసిపాల్టీలు) ౩. ఆరాయిష్ బల్దా (సిటీ ఇంప్రూవుమెంటు బోర్డు) ౪. ప్రకటనలు (ఇన్ఫర్మేషనుబ్యూరో).

### కచేరీలు

నిజాము రాష్ట్రంలో ౧. దీవానీ అనీ, ౨. సర్ఫేఖాస్ అనీ, ౩. పాయెగాలు అనీ, ౪. జాగీర్లు అనీ నాలుగు విధాలైన రాజ్యాంగా లున్నవి.

దీవానీ అనే దాన్నే ఖాల్సా అంటారు. ఈ రాజ్యాంగం ప్రభువు సొంతంగా నియమించిన అధికారుల వశంలో వున్నది. ఇక్కడ దీనికి సంబంధించిన కచేరీల వివరా లిస్తాను.

### రాజధానిలో

హైదరాబాదు నగరంలో యీ క్రింది కచేరీ లున్నవి.

౧. కొత్వాలీబల్దా (సిటీపోలీసు) ౨. జిల్లాపోలీసుకచేరీ ౩. రెవిన్యూఆఫీసు ౪. హైకోర్టు ౫. దీవానీబల్దా (సిటీ సివిల్ కోర్టు) ౬. ఫౌజ్దారీ బల్దా (సిటీ క్రిమినల్ కోర్టు) ౭. దారుల్ఖజా (ఖాజీగారి కోర్టు) ౮. ఉమూరె మజహాబీ (మతశాఖ) ౯. వ్యవసాయపుకచేరీ ౧౦. ఫైనాన్సు ఆఫీసు ౧౧. టంకసాల, ఎలెక్ట్రిసిటీ ౧౨. ఇంజనీరింగుకచేరీ ౧౩. ఉస్మానియా యునివర్సిటీ ౧౪. శాసనసభ ౧౫. కార్యనిర్వాహకసభ (బాబెహుకూమత్) ౧౬. వాణిజ్య, పరిశ్రమలశాఖ ౧౭. ఇన్ఫర్మేషనుబ్యూరో ౧౮. సిటీఇంప్రూవుమెంటుబోర్డు (ఆరాయిషేబల్దా) ౧౯. సఫాయి (సిటీకార్పొరేషను) ౨౦. అబ్కారీ ౨౧. అడవుల కచేరీ ౨౨. కరోడగిరీ (కస్టమ్సు) ౨౩. విద్యాశాఖ ౨౪. జంతువుల చికిత్సశాఖ ౨౫. వైద్యారోగ్యాలశాఖ ౨౬. బందోబస్తు (సెటల్మెంటు) ౨౭. తామీరాత్ (డి. పి. డబ్ల్యు)

### సుబాలలో

౧. సుబేదారీ ౨. న్యాయశాఖ ౩. విద్యాశాఖ ౪. పోస్టు ౫. అబ్కారీ.

### జిల్లాపట్నాలలో

౧. మాల్ (రెవిన్యూ) ౨. న్యాయశాఖ ౩. విద్య ౪. డి. పి. డబ్ల్యు ౫. పోస్టు ౬. కస్టమ్సు (ఇది అన్ని జిల్లా పట్నాలలోనూ వుండదు) ౭. అబ్కారీ ౮. వైద్యశాఖ.

వైశాల్యం యెక్కువైన జిల్లాలలో రెండేసీ మూడేసీ డివిజను లుంటాయి. వీటిలో జిల్లాకలెక్టర్ల మదద్గారులు (అసిస్టెంటు కలెక్టర్లు) ఉంటారు. వీరు రెవిన్యూవిషయాలు చూసుకుంటారు.

### తాలూకాపట్నాలలో

౧. తాలూకాకచేరీ (తహశ్శీలుదారు చేతికింద పేష్కారూ గిర్దావరులూ మొదలయినవారు పనిచేస్తూ వుంటారు) ౨. న్యాయశాఖ అంటే మున్సిఫ్ కోర్టు ౩. పోలీసు ౪. డి. పి. డబ్ల్యు ౫. ఆస్పత్రులు ౬. రిజిస్ట్రేషన్ కచేరీ.

### గ్రామాలలో

౧. పోలీసుపటేలు ౨. మాలీపటేలు ౩. పట్వారీ ౪. సేత్ సందీ లేక తలారి.

ఈ గ్రామాధికారాలు వంశపారంపర్యంగానూ, జ్యేష్ఠాధిష్ఠితంగానూ వస్తాయి.